www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 26 ఫిబ్రవరి 2025

విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలి : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప : మహాశివరాత్రి సందర్భంగా విద్యుత్ అలంకరణలు వద్ద జాగ్రత్తలు పాటించి భద్రతను నిర్ధారించుకోవాలి, విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్. రమణ సూచించారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రి పర్వదినాల సందర్భంగా ఏర్పాటుచేసే పందిళ్లను విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు అతి సమీపంలో వేయడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. పందిళ్లను వాటికీ దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ అలంకరణలకు ఉపయోగించే విద్యుత్ వైర్లు అతుకులు లేకుండా నాణ్యతను నిర్ధారించులోవాలని చెప్పారు. సాధ్యమైనంత వరకు పందిళ్లకు కొయ్యలు లేదా ప్లాస్టిక్ పైపులు ఉపయోగించుకోవాలి అని సూచించారు. అలంకరణకు ఉపయోగించే విద్యుత్ దీపాలు కట్టుకొవడానిఇ ఇనుప పైపులు, కడ్డీలు వాడరాదు. ఒక చిన్న నిర్లక్ష్యం పెనుప్రమాదాన్ని సృష్టిస్తుందన్నారు.

ఏనుగుల బీభత్సం

సంఘటనా స్థలంలో గుమ్మిగూడిన ప్రజలు

మృతిచెందిన చెంగల్‌రాయుడు

ముగ్గురు భక్తులు మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు..పరిస్థితి విషమం
- సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, జగన్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం
- గాయపడిన వారికి రూ.5 లక్షలు
- 'ముక్కా' ఫౌండేషన్ రూ.లక్ష సాయం
- బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే శ్రీధర్ పరామర్శ

మృతిచెందిన దినేష్

మృతిచెందిన మునెమ్మ

ఏనుగుల దాడిలో గాయపడిన అమ్ములు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు(అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండల పరిధిలోని గుండాలకోన వద్ద భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు భక్తులు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి నడుచుకుంటూ వెళుతుండగా వారిపై ఏనుగులు దాడి చేశాయి. ఏనుగుల మంద దాడి చేయడంతో ఉర్లగట్టుపోడు దళితవాడకు చెందిన వంకాయల దినేష్ (35), కె.బుడుగుంటపల్లె పంచాయతీ కన్నగుంట ఎస్‌టి కాలనీకి చెందిన తుపాకుల మణెమ్మ (30), తిరుపతి చంగల్ రాయుడు(30)గా పోలీసులు, అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఉర్లగట్టుపోడు దళితవాడకు చెందిన పలిగెల సిద్దయ్య కుమారుడు పలిగెల రాజశేఖర్, సి.అమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం శివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో శైవ క్షేత్రాలకు వెళుతుంటారు. ఓబులవారిపల్లి మండలం వై.కోట సమీపంలోని గుండాలకోనకు భక్తులు రెండు రోజుల ముందు నుంచి వెళుతుంటారు. ఆ సమయంలోనే సోమవారం అర్ధరాత్రి రెండు, మూడు గంటల సమయంలో అటవీ ప్రాంతంలో వెళుతున్న భక్తులపై ఏనుగులు దాడి చేశాయి. రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్ఐ పి.మహేష్ మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించారు. అదనపు ఎస్‌పి (అడ్మిన్) వెంకటాద్రి, సిసిఎఫ్ సెల్వం, డిఎఫ్ఒ జగన్నాథ్ సింగ్, సబ్ డిఎఫ్ఒ సుబ్బురాజు, ఎఫ్ఆర్ఒ పిఎ శ్యాంసుందర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కాగా వేసవి కాలంలో ఏనుగుల మంద తాగునీటి కోసం అటవీ సమీప గ్రామాలలోని మామిడి తోటలలో దాడులు చేసి కాపు కొచ్చిన మామిడి చెట్లను, పైపులను, మోటార్లను ధ్వంసం చేస్తుంటాయి. ప్రతి సారీ ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తుంటుంది.

సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రుల దిగ్భ్రాంతి

ఏనుగుల దాడిలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాన్, అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని వారు ప్రకటించారు. జరిగిన ఘటనపై సిఎం, డిప్యూటీ సిఎం అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

భక్తుల మృతి బాధాకరం : జగన్

ఏనుగుల దాడిలో భక్తులు మృతి చెందిన ఘటనపై వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భక్తుల మృతి అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మృతు కుటుంబాలకు తన సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

ఏనుగుల దాడి ఘటనపై డిప్యూటీ సిఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తక్షణం స్పందించారు. ముగ్గురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని అటవీ శాఖ అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. బాధిత కుటుంబాలను పరామర్శించాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అవర శ్రీధర్‌ను వై.కోటకు వెళ్లాలని పవన్ ఆదేశించారు. అసెంబ్లీ నుంచి శ్రీధర్ రైల్వేకోడూరుకు వచ్చి బాధితులను

వివరాలను అడిగి తెలుసుకుంటున్న ముక్కా వరలక్ష్మి

మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

పరామర్శించారు.

'ముక్కా' ఫౌండేషన్ ఆర్థిక సాయం

ఏనుగుల దాడిలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకుంటామని కుడా చైర్మన్, ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.లక్ష, గాయపడిన వారికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే అవర శ్రీధర్, ముక్కా వరలక్ష్మి బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్‌లను అందజేశారు. అంత్యక్రియలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.20 చొప్పున అందజేశారు.

అనుమతి లేకుండా అడవిలోకి వెళ్లొద్దు : డిఎఫ్ఒ

ఏనుగుల దాడి ఘటనపై రాజంపేట డిఎఫ్ఒ జగన్నాథ్‌సింగ్ విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలం వస్తున్నందున అటవీ ప్రాంతంలో తాగునీరు లేకపోవడంతో వన్యప్రాణులు అటవీ సమీప గ్రామాలలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. ఏనుగుల మంద గుండాలకోన సమీపంలో సంచరిస్తున్న సమయంలో అటవీ శాఖ అనుమతి లేకుండా కొంతమంది గుండాలకోనకు అంటూ వెళ్లారని చెప్పారు. ఆ సమయంలో ఆహారం లేక కోపంలో ఉన్న ఏనుగుల మందకు రాత్రి సమయంలో మనుషులు కనపడడంతో వారిపై దాడి చేసి ఉంటాయని పేర్కొన్నారు. దాదాపు 15 ఏనుగుల మంద అటవీ ప్రాంతంలో తిరుగుతున్నాయని చెప్పారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేకుండా ఎవరు అటవీ ప్రాంతాల్లోకి వెళ్ళకూడదని తెలిపారు.

మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ

ఏనుగుల దాడిలో మృతి చెందిన వారి మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి, టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహం ప్రసాద్, తాతంశెట్టి నాగేంద్ర, టి.వి.రమణారెడ్డి, మైసూరువారిపల్లె సర్పంచ్ సంయుక్త, తదితరులు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

రాయచోటి టౌన్ : గుండాలకోనకు వెళ్లే యాత్రికులపై ఏనుగుల మంద దాడి చేయడంతో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భక్తులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భక్తుల మరణానికి కారకులైన అటవీ అధికారులను సస్పెండ్ చేయాలన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

సమస్యలపై పోరాటం చేద్దాం

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా
ప్రజాదర్బార్‌లో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మంచి రోజులు వస్తాయని ఎవరు అధైర్య పడకుండా ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పులివెందులకు హెలిక్యాప్టర్‌లో చేరుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇటీవల వైసిపి కార్యవర్గంలో పదవులు పొందిన వారు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి విజ్ఞప్తులను స్వీకరించి మీ సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని, ప్రభుత్వం వినకపోతే పోరాటాలు చేసే దానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. ఏ కార్యకర్తకు అన్యాయం జరిగిన నేనున్నానని వారికి భరోసా ఇచ్చారు. కూటమి నాయకులు దాడులకు ఎవరు భయపడకూడదని ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని వారికి సూచించారు. నియోజక వర్గంలోని తాండాలలో నిర్వహిస్తున్న సుగాలి మహిళలు జగన్ కలిసి అనంతరం హోలీ సంబరాలలో భాగంగా కోలాటాలు చేశారు. పులివెందులకు వచ్చిన జగన్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. భాకరాపురంలోని హెలిప్యాడ్ దగ్గర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు దాసరి సుధా, అమర్నాథ్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

జిల్లా రాజకీయాలపై ఆరా : నెలరోజులుగా జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి వైసిపి నాయకులతో జగన్ ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాల గురించి నాయకులు జగన్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలుస్తుంది. అవసరమైతే పోరాటం చేద్దామని, కొన్ని విషయాలపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని నాయకులకు జగన్ చెప్పినట్టు తెలుస్తుంది. వైసిపి ఎంపిటిసి, జడ్‌పిటిసి, కౌన్సిలర్లను కూటమి నాయకులు భయపెట్టి పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని నాయకులు జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎవరు భయపడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని తెలిపారు.

ప్రజలకు అభివాదం తెల్పుతున్న జగన్

పోస్టు బాక్స్‌లో కార్డులు వేస్తూ నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఆప్కాస్ ప్రయివేటీకరణ ఆపాలి

- అవుట్ సోర్సింగ్ కార్మికుల నిరసన ర్యాలీ
- పోస్ట్‌కార్డుల ఉద్యమం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన ఆప్కాస్ రద్దు చేస్తూ ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించడాన్ని నిరసిస్తూ అవుట్ సోర్సింగ్ కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ, పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించారు. ర్యాలీ పాత మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్‌పోస్ట్ ఆఫీస్ వరకు నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంచిపాటి తిరుపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల మీద కక్షతో మమ్ములను బలి పశువులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయాన కూటమి ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి కార్మికులను రెగ్యులర్ చేస్తామని నమ్మబలికి ఇప్పుడు ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడం దారుణమని తెలిపారు. 2016లో భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని ఆదేశించినా అమలు కావడంలేదని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు కార్మికుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని కోరారు. మార్చి 5న చలో విజయవాడ కార్యక్రమంలో కార్మిక సత్తా చాటుతారని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే సమ్మెబాట పట్టేందుకైన సిద్ధమని హెచ్చరించారు. నగర కమిటీ అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులు 15, 20 సంవత్సరాలు పైబడి తమ ప్రాణాలు ప్రాణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర వ్యాధి కరోనా సమయంలో కూడా తమ ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించారని చెప్పారు. ఇంజినీరింగ్ కార్మికులు ఐదు సంవత్సరాలుగా జీతాలు పెంచకుండా చాలీచాలని జీతాలతో కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వారికి పారిశుధ్యకార్మికులతో సమానంగా జీతాలు పెంచాలని, 36జిఒ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. కోవిడ్-19 కార్మికులకు, అడిషనల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి ఇఎస్ఐ, పిఎఫ్ ఖాతాలు తెరిపించి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కంచుపాటి శ్రీరామ్, ఇత్తడి ప్రకాష్, సుంకర రవి, సుంకర కిరణ్ కుమార్, వడ్లపల్లి శ్రీధర్ బాబు, అదాం, పెంచలమ్మ, రెడ్డమ్మ, లక్ష్మీదేవి, పెద్దమ్మ, ఉష, నాగరాజు, సువర్ణ, హేమలత, రమాదేవి, మహిళా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న సలావుద్దీన్

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో పాసు చేసి కేంద్రానికి పంపాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం, సర్వమత సమ్మేళనం, వివిధ సంస్కృతి, సంప్రదాయలకు నిలయమైన భారతదేశంలో, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుంది విమర్శించారు. దేశంలోని వివిధ రాజకీయ పార్టీలు వ్యతిరేకం చినప్పటికీ, ముస్లిం సామాజిక ఆర్థిక మూలాలను, భవిష్యత్తు తరాల ప్రగతికి అడ్డుకట్ట వెయ్యాలనే దురుద్దేశంతో, కుట్రపూరితంగా వక్ఫ్ ఆస్తులను దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి వెన్నెముకగా ఉన్న సిఎం చంద్రబాబునాయుడు బడ్జెట్ సమావేశాల్లో బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ముస్లిం సామాజిక వర్గ ఎమ్మెల్యేలు, వైసిపి అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర నాయకులు అబ్దుల్ కలాం మౌలా బేగ్, మహబూబ్ అలీ, సర్దార్ ఖాన్, ఆరిఫుల్లా, మెహబూబ్ బాష, అబ్దుల్లా, నసీమా, షేక్.ఖలీల్ పాల్గొన్నారు.

సరుడు చోరీపై పోలీసుల విచారణ

ప్రజాశక్తి-కాశినాయన : బి.కోడూరు మండలం కాసానగరం దగ్గర ఉన్న కస్తూరిబా బాలికల వసతి గృహ ఉపాధ్యాయరాలుపై కొందరు దొంగలు దాడిపై ఆమె మెడలోని సరుడు చోరీ చేసిన విషయంపై బద్వేల్ సిఐ నాగ భూషణం మంగళవారం స్కూలు దగ్గర విచారణ చేపట్టారు. వివరాలు.. మత్తలూరి వరలక్షుమ్మ రోజు మాదిరిగానే స్కూలు వదిలిన తర్వాత పోరుమామిళ్లకు వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డుపైకి వచ్చారు. ఆ సమయంలో బద్వేల్ వైపు నుంచి ఒక కారు వచ్చింది ఆగింది. డ్రైవర్ ఆమె దగ్గరికి వచ్చి కారు ఆపి ఎక్కమని అడిగాడు. కారులో మరో ఇద్దరు మహిళలు ఉండడంతో ఆమె ధైర్యంగా కారు ఎక్కి కూర్చోగానే బయలుదేరిన ఐదు నిమిషాలకే వారి భాష సరిగా లేనందువల్ల ఆమె భయపడి కారు ఆపండి తాను దిగుతాను అని చెప్పారు. కారు ఆపి ఆమెను దించేసి వెళ్లిపోయారు. ఐదు నిమిషాల్లోనే కారులో ఉన్న మహిళలు ఆమె మెడలో ఉన్న బంగారు సరుడును దొంగిలించారు. ఆమె కారు దిగి నాలుగు అడుగులు ముందు వేసి మెడలో సరుడు లేని విషయం గమనించారు. వెంటనే బద్వేలు పోలీసులకు సమాచారం సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై బద్వేల్ పోలీసులు స్కూల్ దగ్గరికి వచ్చి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు.

'సి.పి.బ్రౌన్' ఉనికిని వ్యాప్తి చేస్తాం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్: సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని పాఠకులకు, సాహితీవేత్తలకు మరింత చేరువ చేసేలా కృషిచేసి సంస్థ ఉనికిని నలుమూలలా వ్యాప్తి చేస్తామని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య ఫణితి ప్రకాశ్ బాబు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం విసిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి విసిని శాలువ, పూలమాలతో సత్కరించారు. అనంతరం విసి మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయం, పరిశోధన కేంద్రాన్ని సందర్శించడం ఆనందదాయకమన్నారు. సి.పి.బ్రౌన్ చేసిన సాహిత్యకృషిని కొనియాడారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, జూనియర్ అసిసెంట్లు ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, హరికృష్ణ, శ్రీనివాసులు, అరుణ పాల్గొన్నారు.

వైవీయూ అభివృద్ధికి సహకరిస్తాం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన యూనివర్సిటీ నూతన విసిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ప్రకాష్ బాబుకు ప్రయివేట్ విద్యాసంస్థల రాష్ట్ర జెఏసి కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ప్రయివేట్ డిగ్రీ అండ్ పిజి, బిఇడి కళాశాలల కరస్పాండెంట్లు శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం వైవీయూలో విసిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల కలలు,ఆకాంక్షలను నెరవేర్చాలని, ప్రయివేట్ డిగ్రీ,పీజీ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. విసి సానుకూలంగా స్పందించారు. రిజిస్ట్రార్ పద్మతో సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

విసిని సన్మానిస్తున్న ప్రయివేట్ విద్యా సంస్థల రాష్ట్ర జెఏసి కన్వీనర్

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు : జెసి

ప్రజాశక్తి - కడప : గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో అదనపు ఛార్జీలు వసూలు నిలిపివేయాలని, వినియోగదారుల నుండి గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనంగా డబ్బులు వసూలు చేయకూడదని, నిబంధనలను అతిక్రమించిన డెలివరీ బాయ్స్‌ను హెచ్చరించాలని, లేనిపక్షంలో గ్యాస్ ఏజెన్సీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీల పై అందుతున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని గ్యాస్ ఏజెన్సీల డీలర్లతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వారం ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ సర్వే ద్వారా ఫిర్యాదులు అందిన ఏజెన్సీలకు బిల్లుపై ఉన్న ధర కన్నా ఎక్కువగా వసూలు చేయకూడదని ఆదేశాలు జారీ చేశారు. దీన్ని అతిక్రమిస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు సోకాస్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ ఆధారంగా పెనాల్టీ వేసి చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

డిఎస్‌సి ర్యాంకులు పునఃపరిశీలించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడానికి ఉద్దేశించిన సీనియార్టీ లిస్టులో డిఎస్‌సి ర్యాంకుల్లో తేడాలున్నాయని, డిఎస్‌సిల వారీగా సెలక్ట్ లిస్టులను తీసుకుని ర్యాంకులను పునఃపరిశీలించి సీనియారిటీ లిస్టును తయారుచేయాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. మంగళవారం డిఇఒ షంషుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివార్జున మాట్లాడుతూ ప్రమోషన్లు ఇచ్చేటప్పుడు రోస్టర్ పాయింట్లను ప్రకటిస్తూ రిజర్వేషన్లు పారదర్శకత పాటించాలని కోరారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు పూర్తి పని దినాన్ని కేటాయించి పాఠశాల సమయం వరకు మాత్రమే జరపాలని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను దృష్టిలో ఉంచుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా ప్రవేశపెట్టాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ విషయాల పట్ల సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్ బాబు, గంగరాజు, కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

స్పీకర్ తీరు అవమానకరం

ప్రజాశక్తి - కడప : అసెంబ్లీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీరు తీవ్ర అవమానకరం అని టిటిడి మాజీ సభ్యులు యానాదయ్య పేర్కొన్నారు. మంగళవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై వైఎస్ జగన్ పోరాటం చేస్తుంటే సమయం ఇవ్వకపోవడం దారుణం అన్నారు. ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీలో ప్రజా సమస్యలను వివరంగా చెప్పే వీలు ఉంటుంది అని తెలిపారు. ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి కూటమి ప్రభుత్వానికి భయం ఎందుకు? అని ప్రశ్నించారు.

ఘనంగా నాగార్జున మోడల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

చిన్నారులతో విద్యా సంస్థల చైర్మన్, డైరెక్టర్లు, ప్రిన్సిపల్

నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్లో రినేజాన్స్ -2025 పేరిట మంగళవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విద్యాసంస్థల చైర్మన్ యం.శివశంకరరెడ్డి, డైరెక్టర్స్ శ్రీదేవి, యం.భానేష్ సాయి రెడ్డి హాజరయ్యారు. చైర్మన్, డైరెక్టర్లు వివిధ తరగతుల ఇన్‌ఛార్జులు, ప్రిన్సిపల్స్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. డైరెక్టర్ శ్రీదేవి విద్యాసంస్థల విజయ పరంపరకు సంబంధించిన నివేదికను వినిపించారు. సభకు అధ్యక్షత వహించిన చైర్మన్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యంత వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత సమాజంలో విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను, తమ శక్తి సామర్థ్యాలతో ఎదుర్కొని సంపూర్ణ వికాసవంతులు కావలనే ఉద్దేశంతో ఈ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సైన్స్ ఫెయిర్, వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు, మైమ్ షోలు సందేశాలు ఆహూతులను ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణవేణి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ సమీర, బోధన, బోధనేతర సిబ్బంది, అధిక సంఖ్యలో తల్లిదండ్రులు, చిన్నారులు, నగరంలోని ఇతర పాఠశాలల అధినేతలు, నగర ప్రముఖ వ్యక్తులు హాజరయ్యారు.

గౌరమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

ప్రమాద బాధితులకు 'మానవత' చేయూత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల రింగ్ రోడ్డు సమీపంలోని కృష్ణాలయం వద్ద వారం రోజుల క్రితం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన ముగ్గురు వ్యక్తులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేసింది. పులివెందుల పెన్షనర్స్ భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జయమ్మ కాలనీకి చెందిన బాధితురాలు గౌరమ్మకు రూ.10వేల చెక్కును అందజేశారు. గౌరమ్మతోపాటు గాయపడిన మరో ఇరువురు కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చులకోసం సొమ్మును వినియోగించుకోవాలని మానవత కోరింది. సమావేశంలో మానవతా చైర్మన్ డివి కొండారెడ్డి, డైరెక్టర్ సదాశివారెడ్డి, సివి రంగారెడ్డి, జి.చంద్రశేఖర్‌రెడ్డి, పి.వెంగల్ రెడ్డి, బండి శివరామిరెడ్డి, నారాయణరెడ్డి, శేషయ్య, కోశాధికారి హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి పథకాలకు ప్రాధాన్యతనివ్వాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 2025-26 ఏడాదికి సంబంధించి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు, సూపర్ సిక్స్ పథకాలకు ప్రాధాన్యతనివ్వాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాగునీటి ప్రాజెక్టులకు, సూపర్ సిక్స్ పథకాలకు కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కనీసం వచ్చే ఆర్థిక సంవత్సరంలోనైనా ఈ రెండు రంగాలకు సముచిత రీతిలో బడ్జెట్ కేటా యింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రమ న్నారు. వ్యవసాయానికి సాగునీటి రంగం గుండెకాయ వంటిదని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మొత్తం బడ్జెట్‌లో 15 శాతం సాగునీటి రంగానికి కేటాయించడం వల్ల ప్రాజెక్టుల్లో సింహ భాగం కాంగ్రెస్ పాలనలో పూర్తయినట్లు తెలిపారు.

నేడు ఘనంగా శివరాత్రి వేడుకలు

- రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి న్యూ కేటగిరి ఎడ్ల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చక్రాయపేట

శ్రీవెంకటేశ్వర స్వామి, రాచరాయ స్వామి మూలవిరాట్

చక్రాయపేటలో వెలిసిన శ్రీవెంకటేశ్వర స్వామి, రాచరాయ స్వామి (వీరభద్రుడు) దేవాలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ మోపురి రామాంజనేయులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టిటిడి వేద పండితులచే ఒకే వేదికపై శివ పార్వతులు, లక్ష్మీ వెంకటేశ్వర స్వాములకు కల్యాణం వైభవంగా నిర్వహిం చనున్నట్లు తెలిపారు. తొమ్మిదేళ్లుగా రామాపురం వాసులు మల్‌రెడ్డి మురళీ ధర్‌రెడ్డి, ఆయన సతీమణి అమరావతి ఉదయం పదిగంటల నుండి రాత్రి 10 గంటల వరకు వేలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తు న్నారు. ఈ ఏడాది కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మురళీ ధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి న్యూ కేటగిరి ఎద్దులు బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతి రూ.70,000 మొదలు కొని 8వ బహుమతి రూ.5,000 కన్సొలేషన్ బహుమతి ఇవ్వనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలతోపాటు వేంపల్లి, లక్కిరెడ్డిపల్లి మండలాల నుంచి వేలాది మంది రానున్నారు. బండలాగుడు పోటీలు తిలకించేందుకు మహిళలకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఖాజీపేట : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కడప-కర్నూలు జాతీయ భూమాయపల్లె వద్ద ఉన్న శివాలయం, అగ్రహారం శివాలయం, నాగ నాథేశ్వర కోన, పిడబ్ల్యూడి బంగ్లా వద్ద ఉన్న శివభక్తేంద్ర ఆలయం0లో శివుడికి అభిషేకాలు ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. అగ్రహారం నుండి శివాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శివాలయాలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.

రైతులతో మాట్లాడుతున్న ఎఒ మ్యాగీ

రైతులు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని చిన్నగురువలూరు, పెద్దగురువులూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మ్యాగీ మాట్లాడుతూ రైతులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా రైతులకు ఒక ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. తద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందుతారన్నారు. సాగులో ఉన్న పొలాలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. యూరియా అవసరం మేరకు వాడుకోవాలని తెలిపారు. పొలంలో నీరు ఎక్కువ నిలవకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విఎఎ సుప్రియ, మాధవిలత, రైతులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే.. రేపటి పౌరులు

ప్రజాశక్తి - చక్రాయపేట

నేటి విద్యార్థులే.. రేపటి పౌరులని ఎంఇఒ-2 వెంకట రవికుమార్ పేర్కొన్నారు. చిలేకాంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 2024-2025 పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పివి రమణ ఆధ్వర్యంలో ముందుగా సరస్వతి పూజ చేశారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి ట్రిపుల్‌ఐటికి ఎంపిక కావాలని వక్తలు కోరారు. మారుమూల ప్రాంతమైన చిలేకంపల్లి గ్రామంలో పేద, బడుగు, బలహీన వర్గ కులాలకు చెందిన వారు ఈ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగిన విషయాన్ని కూడా విద్యార్థులకు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

కళింగర రైతు కుదేలు

తెగుళ్లతో తగ్గిన దిగుబడి.. వేసవిలోనూ ధర పతనం..పెట్టుబడి రాక అప్పులపాలు

సాగులో ఉన్న కళింగర పంట

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అన్నదాత ఆరుగాలం కష్టపడినా నష్టాలే మిగులుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో కలింగర సాగుచేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు అనుకున్న రైతులకు ప్రతికూల వాతావరణంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. పంట దిగుబడి, నాణ్యత తగ్గడంతోపాటు ధరలు కూడా పతనమయ్యాయి. అన్నదాత కష్టం నేల పాలైంది. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 480 ఎకరాల్లో కళింగర వంట సాగు చేశారు. కిలో విత్తనం రూ.28వేలతో కొనుగోలు చేసి సాగు చేశారు. పంట పూత, పిందె వచ్చే సమయంలో చలి, వాతావరణం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సస్యరక్షణ చర్యలు ఎన్ని చేపట్టినా అవి పంట దిగుబడిని పెంచలేకపోయాయి. ఎకరాకు 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉంది. ఈసారి 7 నుంచి 10 టన్నులు మాత్రమే వస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా కళింగర సాగుకు రూ.70వేల నుంచి రూ.90వేల వరకు పెటుబడి అవుతుంది. ప్రతికూల పరిస్థితుల్లో కళింగర రైతులు నష్టపోవాల్సి వస్తోంది. అప్పుల పాలవుతున్నారు.

కళింగర ధర పతనం

కళింగర గతంలో టన్ను రూ.18వేల నుంచి రూ.22 వేల వరకు ధర పలికిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 10టన్నుల దిగుబడి వచ్చినా లాభం వచ్చేది. ప్రస్తుత సీజన్‌లో ఎకరాకు పది టన్నుల దిగుబడి వస్తున్నా.. ధర అమాంతం పడిపోయింది. టన్ను కళింగర ధర రూ.7వేల నుంచి రూ.8 వేలు పలుకుతోంది. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా దక్కదు. ప్రస్తుతం ఉన్న ధరల్లో పంట దిగుబడి మార్కెట్‌కు తరలించలేక రైతులు స్థానిక వ్యాపారులకు విక్రయిస్తుండడం గమనార్హం.

తెల్లబూజు, పొడతో కాయకు దెబ్బ..

చలి ప్రభావం, వాతావరణ పరిస్థితులు కళింగర వంట దిగుబడిపై తీవ్రప్రభావం చూపాయి. కలింగర కాయలపై తెల్ల పొడ ఎక్కువగా ఉన్నట్లు రైతులు తెలిపారు. కళింగం కాయ లోపలి భాగంలో తెల్లబూజు ఏర్పడి కాయ చెడిపోతున్నట్లు వాపోతున్నారు. తెల్లబూజు కాదణంగా కాయలోపల తొర్ర ఏర్పడి తినడానికి పనికి రాకుండా పోతున్నట్లు తెలిపారు. పొడవచ్చిన కాయ లను వ్యాపారులు కొనడం లేదు.

పెట్టుబడి కూడా వచ్చేది కష్టమే..

2.50 ఎకరాల్లో కళింగర సాగు చేశా. రూ.2 లక్షల వరకు పెట్టుబడి అయింది. 25 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం కళింగర టన్ను ధర రూ.7వేల నుంచి రూ.8వేలలోపే. పెట్టుబడి కూడా వచ్చేది కష్టమే. వాతావరణ ప్రభావంతో కళింగర దిగుబడి తగ్గింది. నాణ్యతలోపంతో ధర కూడా పడిపోయింది.

-మధుసూదన్‌రెడ్డి, రైతు, లింగాల.

నాణ్యతలేక ధరలు తగ్గాయి..

వాతావరణ ప్రభావంతో దిగుబడి తగ్గింది. 4.50 ఎకరాల్లో కళింగర సాగుచేశా. కాయల నాణ్యతపై తెల్లపొడ, తెల్లబూజు ప్రభావం ఎక్కువగా ఉంది. ధర కూడా తగ్గింది. కళింగర ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయితే ధరలు పెరుగుతాయి. స్థానిక మార్కెట్లో వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో ధరలు బాగా పతనమయ్యాయి.

- మహేశ్వర్‌రెడ్డి, రైతు, పులివెందుల.

మొదటి గంట సమయం చాలా విలువైంది

గుండెపోటుకు ఉచితంగా సూది మందు : ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గుండెపోటు వచ్చిన వెంటనే చికిత్స అందించి మెరుగుపరచడానికి మొదటి గంట చాలా విలువైందని, ఈ గంటలోపే ప్రభుత్వాసుపత్రికి రోగిని తీసుకొచ్చి ఉచిత సూది మందు అందిస్తే ఆరోగ్యం కుదుట పడుతుందని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సిఎ ఆనంద్‌బాబు తెలిపారు. గుండెపోటుకు గురైన వ్యక్తి ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రభుత్వం రూ.45వేలు విలువచేసే టెనెక్టిప్లేస్ అనే సూదిమందును మంజూరు చేసిన క్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. 15నెలల నుండి ఈ ఇంజెక్షన్‌ను గుండెపోటు వచ్చిన వ్యక్తులకు అందజేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 36మంది రోగులకు ఈ మందు వేశామన్నారు. 95శాతం మంచి ఫలితం వచ్చిందన్నారు. గుండె కండరాలకు రక్తప్రసరణం తగ్గడం వల్ల గుండెపోటు వస్తుందన్నారు. ఛాతీ మధ్యలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండెపోటు వచ్చే ముందు శరీరంలో తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. దవడ, మెడ నొప్పి, ఎడమ చేతివైపు నుండి నొప్పి, రెండు చేతుల్లో నొప్పి లక్షణాలుగా కూడా కనిపిస్తాయన్నారు. హై బిపి ఉన్నవాళ్లకి, చెడు కొలెస్ట్రాల్ ఉన్నవారికి, డయాబెటిస్ సమస్య ఉన్నవారికి ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్నవారికి గెండె పోటు వచ్చే అవకాశం ఉందన్నారు. గుండె జబ్బుకు లోనుకాకుండా ఉండాలంటే సరైన జీవన విధానాన్ని అలవరచుకోవాలన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలన్నారు. మంచి అలవాట్లను కలిగి ఉండాలన్నారు. పాశ్చాత్య ఆహార పదార్థాలను దూరం చేయాలన్నారు. మానసిక ప్రశాంతతను కలిగి ఉండాలన్నారు. మన ఆహారంలో తప్పకుండా పోషకాలు, ప్రొటీన్లు, పీచు పదార్థాలు ఉండేలా చూసుకోవాలని డాక్టర్ ఆనంద్‌బాబు సూచించారు.

విద్యార్థుల మనో వికాసంలో అంగన్వాడీలే కీలకం

అంగన్వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపిడిఒ వీరకిషోర్

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థుల మానసిక వికాసంలో అంగన్వాడీ కార్యకర్తలే కీలకమని ఎంపిడిఒ వీరకిషోర్ తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్ష్మీపేటలో జరుగుతున్న జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో చివరి రోజు మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శిక్షణ పొందిన అంగన్వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్లను అందజేశారు. అంగన్వాడీ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా శారీరక వికాసం, భాషా వికాసం, సామాజిక వికాసం మొదలైనవి సాధించే విషయంలో ప్రముఖ పాత్ర అంగన్వాడీ కార్యకర్తలదే అన్నారు. ఎంఇఒ వంశీకృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీ పాఠశాల పిల్లలకు తల్లిఒడి లాంటిదన్నారు. తల్లి ఒడిలో పిల్లవాడు ఎంత భద్రంగా ఉంటాడో అంగన్వాడీ పాఠశాలలో కూడా అంత భద్రంగా ఉండాలన్నారు. ఆ విధంగా చూసుకునే బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలది అని వివరించారు. కార్యక్రమంలో సిడిపిఒ సావిత్రమ్మ, ప్రధానోపాధ్యాయులు సూర్య నారాయణ, అంగన్వాడీ సూపర్వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్నమ్మ, డిఆర్‌పిలు రిజ్వాన్ అలీ, శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలో అభ్యసనాన్ని మెరుగుపరచాలి

లింగాల : విద్యార్థి దశలోనే సరైన మార్గంలో పిల్లలను నడిపించి, వారి బంగారు భవిష్యత్‌కు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఇఒ-2 రామకృష్ణయ్య సూచించారు. అంగన్వాడీ కార్యకర్తల జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో చివరి రోజు ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పిల్లలను మానసికంగా, భాషా పరంగా తీర్చిదిద్దడం తమ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌పిలు శ్రీరెడ్డి రామిరెడ్డి, మధుసుథన్ రెడ్డి, శ్రావణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలను బలోపేతం చేయాలి

చక్రాయపేట : అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజులు పేర్కొన్నారు. ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చివరి రోజు సూపర్‌వైజర్లు సుహాసిని, సుభద్ర, ఆర్‌పిలు శ్రీనివాసులు, గాలి శ్రీనివాసులు, ఎస్ఐపియు ఎస్ భారతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న అంగన్వాడీలు

డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

మాట్లాడుతున్న వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వ నిభందనలకు విరుద్ధంగా పట్టణంలో నిర్వహిస్తున్న డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా వీటిలో టెస్టింగ్‌కి వచ్చిన వారితో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. నిభందనలు ప్రకారం ధరల పట్టిక ఉండాలన్నారు. టెస్టులు చేయించుకున్న వారికి కట్టిన డబ్బు రశీదులు ఇవ్వాలన్నారు. స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లలో క్వాలిఫై వారిని పెట్టుకోవాలని ఉన్నా, ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ప్రొద్దుటూరు చుట్టుపక్కల జమ్మల మడుగు, మైదుకూరు, ఎర్రగుంట్ల, చాగలమర్రి వంటి సుదూర ప్రాంతాల నుండి పేద, మధ్య తరగతి ప్రజలు వస్తుంటారని తెలిపారు. వీరిని నిలువుదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఆస్పత్రుల కన్సల్టెంట్ల ద్వారా కమీషన్ కోసం స్కానింగ్, టెస్టుల నిమిత్తం డాక్టర్లు చీటీ రాసి పంపుతున్నారని తెలిపారు. ఇది జిల్లా వ్యాప్తంగా జరుగుతోందన్నారు. ఇదంతా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించకపోవడంతోనేనని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న సెంటర్లపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రేపు మార్కెట్ గుత్త వేలం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ గుత్త హక్కులకు సంబంధించి గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శేషఫణి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు 27వ తేదీ మధ్యాహ్నం 12గంటల్లోపు రూ.5లోలు ధారావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ రుసంగా రూ.5000 చెల్లించాలని, ఈ మొత్తం మళ్లీ ఇవ్వరని తెలిపారు. పూచీకత్తు రూ.4లక్షలు సమర్పించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

రైతుల ఆత్మహత్యలపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని రైతులు ఇటీవల అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై మంగళవారం జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ విచారించారు. పెద్ద జొన్నవరం, జిల్లెల్ల గ్రామాల రైతుల కుటుంబాలను ఆర్‌డిఒ విచారించారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ పెద్ద జొన్నవరం గ్రామానికి చెందిన లంక వీరయ్య, జిల్లెల్ల గ్రామానికి చెందిన డిటి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను విచారించామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అక్బల్ బాషా, మైదుకూరు వ్యవసాయ శాఖ ఎడి క్రిష్ణమూర్తి, డిప్యూటీ తహశీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ జాన్సన్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

దీక్షలో నినాదాలు చేస్తున్న పశువైద్య విద్యార్థులు

23వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

తమకు వైద్య విద్యార్థులతోపాటు సమాన స్టయిఫండ్ ఇవ్వాలని పశువైద్య విద్యార్థులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 23వ రోజుకు చేరుకున్నాయి. గోపవరం పంచాయతీలోని పశువైద్య కళాశాలలో దీక్ష కొనసాగిస్తున్నారు. 13 ఏళ్లుగా సమన్యాయం కోసం పోరాడుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని వారు ప్రశ్నించారు. ఎంబిబిఎస్ విద్యార్థులతో సమానంగా తమకు కూడా ఉపకార వేతనాలు పెంచాలన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

మసీదుల వద్ద కనీస వసతులు కల్పించండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న ఇర్ఫాన్ బాషా

రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ఈనెల 28 నుంచి మార్చి 28 వరకు మసీదుల వద్ద కనీస వసతులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఇర్ఫాన్ బాషా కోరారు. ఆ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన కమిషనర్ మల్లికా ర్జునకు వినతిపత్రం అందజేశారు. ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని అన్ని మసీదుల్లో ప్రధానంగా నీటి వసతి, మసీదు పరిసర ప్రాం తాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. ప్రార్థనలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రంజాన్ పర్వదినం సందర్భంగా కొర్రపాడు రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో నమాజ్ చేసుకునేందుకు ముస్లింలు ఎక్కువ సంఖ్యలో వస్తారని, అక్కడ నీటి వసతి, తాగునీటి వసతి, చలువ పందిర్లు, మైకు సెట్టింగ్, మైదానం శుభ్రత వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

10న మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెద్దముడియం

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని మార్చి 10న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, భాగ్యమ్మ పిలుపునిచ్చారు. సిఐటియు గౌరవ అధ్యక్షులు ఏసుదాసు ఆధ్వర్యంలో మంగళవారం పెద్దపసుపుల గ్రామంలోని భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్స్ నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు అంగన్వాడీ కమిటీ సభ్యులు ఎంవి హరిప్రియ, హసీనా, శ్రీదేవి, హైమవతి, ఎం లక్ష్మీదేవి, జమాల్ బి, మేరీ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఎస్ఆర్ఐటి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ ఆర్మ్ సాఫటెక్ ప్రయివేట్ లిమిటెడ్ వారు ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాల భర్తీ నిమిత్తం బిటెక్ ఫైనలియర్ అన్ని బ్రాంచల వారికి మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఇందులో 19 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. వీరికి ఏడాదికి రూ.2.5 లక్షల వేతనం ఇస్తారని టిపిఒ సునీల్ తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ వేంకటేశ్వర రెడ్డి, హెచ్‌ఒడిలు అభిందనందించారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - కడప

అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, ఆకలితో ఉన్న వారికీ ప్రతిఒక్కరు అన్నం పెట్టాలని మైనార్టీ నేత సుభాన్ బాషా పిలుపునిచ్చారు. కడప నగరంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద సిఎస్ఐ స్కూల్ 1978 పూర్వపు విద్యార్థుల బ్యాచ్ ఆధ్వ ర్యంలో మంగళవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ నేత సుభాన్ బాషా మాట్లాడుతూ దాదాపు రెండు సంవత్సరాల నుంచి ఈ అన్నదాన కార్యక్రమాన్ని యధావిధిగా కొన సాగిస్తున్నామన్నారు. తన తోటి స్నేహితులు అందరూ కలిసి ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉన్న వారందరూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని అయన కోరారు. కార్యక్రమంలో సుల్తాన్ బాబా (మున్నా),అబ్దుల్ కరీం, విజయ్ కుమార్, శ్రీనివాసులు, జయ్ కుమార్, రఫీ, జోహార్ బాషా, అలీ ,ఉస్మాన్ ఖాన్, రఫీద్దీన్ పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న సుభాన్‌బాషా

ఉమ్రాకు వెళ్లడం అభినందనీయం

రంజాన్ పవిత్ర మాసంలో తన మిత్రుడు అబ్దుల్ కరీం ఉమ్రాకు వెళ్లడం చాలా సంతోషంగా ఉందని మైనార్టీ నేత సుభాన్ బాషా పేర్కొన్నారు . కడప నగరంలోని గుంతబజార్ లో ఉన్న మైనార్టీ నేత సుభాన్ బాషా కార్యాలయంలో ఉమ్రాకు వెళుతున్న అబ్దుల్ కరీం కు మంగళవారం ఘనంగా సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ నేత సుభాన్ బాషా,విజయ్ కుమార్,శ్రీనివాసులు, జయ్ కుమార్, రఫీ, జోహార్ బాషా, అలీ, ఉస్మాన్ ఖాన్, రఫీద్దీన్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA

M.V.O.P. No. 344/2024

Y.Soma Sekhar Reddy. **...Petitioner**

Vs

1. Kothapalle Pullaiah, S/o Ankalaiah, aged about 56 years, Driver of Annamacharya Engineering College bus bearing No AP 29TA8420, R/o at D.No.1/162, Sastry Nagar, Akkayapalle, Ravindra Nagar Post, Kadapa City & YSR District.

...Respondent No.1

NOTICE

పై నెంబరులోని పిటిషనరు నష్టపరిహారము కొరకు దావా వేసియున్నారు. ఈ కేసు వాయిదా 03.03.2025 మీ హాజరు కొరకు ఉన్నది. ఆరోజున మీరు పై కోర్టు నందు ఉదయం 10.30 గంటలకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని మీరు హాజరై మీ అభ్యంతరములను తెలుపుకొనవలెను. లేనిఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//

జి.బి.లక్ష్మిరెడ్డి

పిటిషనరు తరపున అడ్వకేటు,
కడప.